

శివాలయం మెట్లెక్కబోతూ అరుగు మీద గోడకి చేరగిలబడి ఆకాశంలోకి చూస్తున్న రాజేశ్వరిని చూసి నా మిత్రుడు ఉమ ఒక్క క్షణం ఆగి, తేరిపార చూసి, మళ్లీ ముందుకు నడుస్తూ "ఎవరామె?" అన్నాడు.

ఉమ పూర్తిపేరు ఉమామహేశ్వరం. ఇద్దరం చాలా కాలం ఒకే గవర్నమెంటు స్కూల్లో పని చేసి రిటైరైనాం. ఆ తర్వాత స్వగ్రామమైన ఈ ఊరొచ్చేసాను నేను.

"గత నాలుగేళ్లుగా ఆమెని ఈ శివాలయం అరుగు మీదే చూస్తున్నాను" అన్నాను.

"ఆమె పేరు తెలియదా?" అన్నాడు.

"తెలుసు. రాజేశ్వరి"

అంతే... ఉమ నన్నింకేం అడగలేదు. ఇద్దరం గుళ్లోకి వెళ్లి దణ్ణం పెట్టుకుని, కొబ్బరికాయ కొట్టి, ఆ నీళ్లతోనే లింగాన్ని అభిషేకించి శిధిలావస్థలో వున్న మండపం మీద కూర్చున్నాం. అది ఊరి చివర ఉన్న శివాలయం. జనం ఎవరూ రారు. ఉదయం, సాయంత్రం అతికష్టం మీద మూడు కిలోమీటర్ల దూరంలోని ఊళ్లోంచి నడిచి వచ్చి ఒక బ్రహ్మణుడు దీపారాధన చేసి పోతుంటాడు. అతన్నెవరూ జీతంమీద కాని, బత్తెం మీద కాని నియమించలేదు. నేను మాత్రం నా వ్యాసంగానికి అనువుగా ఏకాంతం కోసం ఆ ఆలయాన్ని, దాని పరిసర ప్రాంతాల్నీ ఎన్నుకోవడం వల్ల తరచూ వస్తూంటాను.

"ఏరా! ఏం చేస్తున్నావు? ఇంకా కథలు రాస్తూనే వున్నావా?" అన్నాడు ఉమ కొబ్బరి చిప్పని నేలకేసికొడుతూ.

"ఆ... ఏదో వ్రాస్తూనే వున్నాను. కాకపోతే ఇదివరకటి ఉత్సాహం లేదు" అన్నాను.

చాలాకాలం తర్వాత కలవడంతో కబుర్లలో పడి టైము చూసుకోలేదు. సూర్యాస్తమయమై చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఇద్దరం లేచి బయల్దేరాం. ఓ నిద్రగన్నేరు పుష్పాన్ని కోసి నంది మీదుంచి, గుడి బయటికివచ్చి నడక సాగించాం. భోజనాలయ్యాక మేడమీద వేసిన మంచాల మీద నడుంవాల్చాం.

పున్నమి చంద్రుడి మీద నుండి మెల్లగా జరిగిపోతున్న పల్చటి ధవళ మేఘాలు నెలరాజు ముఖాన సరసంగా జాలువారుస్తున్న నింగికన్నె పయ్యెదల్లా ఉన్నాయి. ముత్యాలు నేలపై ఒలకబోసినట్లున్న శరత్పూర్ణిమ వెన్నెల... వీధి చివరి రామాలయంలో పవళింపు సేవ... ఊరి చివర ఉన్నాడో లేడో తెలీని శిథిలాలయంలో నిరంతరం జాగరణలో శివుడు...

"చాలాకాలం తర్వాత మనస్ఫూర్తిగా ఒక కథ వ్రాయబోతున్నాను" నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ అన్నాను.

"అంటే ఇందాక నువ్వన్న 'ఉత్సాహం' తోనా?" అన్నాడు ఉమ వక్కపొడి నోట్లో వేసుకుంటూ.

"ఖచ్చితంగా అంతే. ఒక రకంగా చెప్పాలంటే ఇదివరకటి ఉత్సాహంతో" అన్నాను.

అతడేం మాట్లాడలేదు. ఎందుకో ఉన్నట్టుండి ఆలోచనల్లోకి వెళ్ళిపోతున్నాడు. గతంలో అయితే ముందే అడిగే వాడు ఇతివృత్తాన్ని. అందుకే అతడి ఆలోచనల్ని భంగపరుస్తూ "ఇతివృత్తం ఏమిటని అడగవేం" అన్నాను.

"చెప్పు!"

"రాజేశ్వరి కథ"

"ఏ రాజేశ్వరి?" అన్నాడు ఆశ్చర్యంగా.

"శివాలయం అరుగు మీద చూసిన రాజేశ్వరే... ఏం?" అన్నాను.

"ఆమె గురించి...!" నొసలు చిట్లించి చూస్తూ అర్థోక్తిలో ఆపాడు.

"తెలుసుకున్నాను" అన్నాను... 'అతడి సందేహం అర్థం అయింది' అన్నట్టుగా.

"ఎలా?" అన్నాడు ఆశ్చర్యం నిండిన గొంతుతో.

# శిథిలాలయంలో శివుడు

కోడూరు శ్రీవేంకటేశ్వరస్వామి

"ఆమె చెప్పింది" అన్నాను విశ్రాంతిగా దిండు మీదికి శేషపాన్పుమీద విష్ణుమూర్తి భంగిమతో వాలుతూ.

ఎందుకో తెలీదు. మందహాసం చేస్తూ... "కథ చెప్పు" అన్నాడు.

చెప్పడం ప్రారంభించాను. సుమారు నాలుగైదు సంవత్సరాల క్రిందట ఓ సాయంకాలం శివాలయం మెట్లెక్కుతూ మొదటిసారి చూశాను అక్కడే అరుగు మీద కూర్చున్న రాజేశ్వరిని. ఆ తర్వాత ఎప్పుడు వెళ్లినా ఆమె అక్కడే ఉండటం చూసి, ఒక రోజు వస్తూ కొబ్బరి చిప్పా, అరటి పండూ ఆమెకిచ్చి 'ఎవరమ్మా నువ్వు?' అని అడిగాను. నేనిచ్చిన ప్రసాదం తీసుకుంది గానీ, సమాధానం ఏమీ చెప్పలేదు. నేను రెట్టించనూ లేదు. ఆ తర్వాత మళ్లీ అదే ప్రశ్న వేశాను. ఆ తర్వాత కథ...

* * *

మీరు మండపం మీద కూర్చుని ఏదో వ్రాస్తున్నారేమిటి?" మెల్లగా అడిగింది నా ప్రశ్నకు సమాధానం చెప్పకుండా, రాజేశ్వరి.

"కథ... అయినా అదంతా నీకెందుకుగానీ, నువ్వెవరో చెప్పు...?" అన్నాను విసుగ్గా.

"నేనెవరో చెప్తే చాలా?"

ఆమె అడిగిన తీరు చూస్తే ఇంకా ఏదో చెప్పాలనుకుంటోంది అనిపించింది. వెంటనే అన్నాను "నీకేం చెప్పాలనిపిస్తే అది చెప్పు" అన్నాను.

"అయితే కథగా వ్రాస్తారా?"

"అలాగే. తప్పకుండా వ్రాస్తాను. ఉన్న



గురజాడ జయంతి సందర్భంగా డా॥ పోరంకి దక్షిణామూర్తి 'కథానిక స్వరూప స్వభావాల్ని ఆవిష్కరించిన డా॥ సి. నారాయణరెడ్డిని సత్కరిస్తున్న డా॥ పోరంకి దక్షిణామూర్తి, డా॥ వేదగిరి రాంబాబు.

మున్నట్టు చెప్పు. నీకు అనుకూలంగా చెప్తే, నేను వ్రాయబోయే కథ అవాస్తవిక కథ అవుతుంది" అన్నాను.

"నా జీవితంలో నాకు నేనే ప్రతికూలం. నా భావాలు, నా ప్రవర్తన అంతా నా సంబంధీకులకి, చివరికి నాకు కూడా ప్రతికూలమే. కనుక అనుకూలమనే ప్రసక్తే లేదు. ఒకవేళ అనుకూలంగా చెప్పాలనుకుంటే కథే లేదు. నిజం చెప్పాలంటే నా జీవితానికి, మరో ఇద్దరి జీవితాలకీ కూడా నేనే ప్రతినాయకురాలిని. ఇందులో అవాస్తవం ఎంతమాత్రం లేదు" నిర్లిప్తంగా అంది రాజేశ్వరి.

ఆమె చింపిరి జుట్టు, చిరిగి మాసికలైన చీర, చెప్పులు లేని కాళ్లు... అంత వర్ణించదగ్గ రూపమేం కాదు. నాకు ముఖ్యమైంది ఆమె చెప్పబోయే కథ. అందులోనూ ఆమె మాటల మాటున ఉన్న దైన్యం, ఆవేదన, పశ్చాత్తాపం అన్నీ కలగలిపి ఆమె చెప్పబోయే కథ ఎంత లోతైనదో చెబుతున్నాయి.

ఒకసారి తల గోక్కుని, ఆలయ శిఖరం వైపు చూసి చెప్పటం ప్రారంభించింది.

"నాతి చరామి... అన్న ప్రతిజ్ఞని నిలువునా పాతేసాను. విచక్షణాజ్ఞానాన్ని ఉగ్గుపాలతో ఒంటబట్టించుకున్న నా భర్తకి తీరని ద్రోహం చేశాను. స్త్రీగా పుట్టి మరో సాధ్వీమణికి అన్యాయం చేసాను" అంటూ ఆగి మళ్లీ చెప్పబోతూంటే...

"ఎందుకు?" అన్నాను.

"చిన్నతనం నుంచి నేను కోరుకున్నది ఎట్టి పరిస్థితుల్లోనూ నాకు అంది తీరాల్సిందేననే మంకుతనం. ఆ మంకుతనాన్ని మాన్పాలనే మా అమ్మానాన్నల ప్రయత్నం ఎంతకూ సఫలం కాలేదు. వయసు పెరుగుతున్న కొద్దీ నా ఆశలకు రంగు రంగుల రెక్కలొచ్చి అవి అందని ద్రాక్షపళ్లు అవటం గ్రహించి, నా మంకుతనం ప్రమాదకరంగా మారకముందే ఓ స్కూల్ టీచర్‌తో నా పెళ్లి జరిపించేశాడు నాన్న".

"నా అలవికాని కోరికలను విచక్షణతో సమాధానపరచాలనుకున్న నా భర్త ప్రయత్నం వృధా అయింది. కోరిన నగ, మనసు పడ్డ చీర, చూడాలనుకున్న సినిమా... రిక్షా, ఆటో... హోటల్... కోరికలకి అంతేముంది? కానీ నాకు అన్నీ తీరాల్సిందే. రాను రానూ నిత్యం ఓ సమస్యగా మారాను నేను. అయినా ఆయన సహనపు కవచాన్ని నా మూర్ఖత్వపు ఆయుధం ఛేదించలేకపోయింది. కానీ సమస్యకి ఆర్థిక కోణం ఉండటంతో నన్ను నేను నివారించుకోవలసి వచ్చింది. అది ఇచ్ఛాపూర్వక నియంత్రణ కాకపోవడంతో అది నా మనసుమీద ప్రభావం చూపించింది. తదనుగుణంగా అది ఆయన మీద వ్యతిరేకతగా ప్రారంభమై, విరక్తిగా పరిణమించింది.

మనసు ఆటవిడుపు కోసం తపించింది. దాని పర్యవసానమే మూర్తిగారితో పరిచయం. నేనేదో సాధించాననే ఛాయా స్ఫూర్తి. నా ప్రవర్తన మితిమీరి ఆయనతో ఆ పరిచయం అక్రమం కావటానికి ఎంతో కాలం పట్టలేదు. ఆయనకు భార్యా పిల్లలున్నారనే విషయం కూడా నాకు ముందే తెలుసు. మూర్తిగారి కోరికను తీర్చడానికి నా శరీరం కల్పవృక్షం. నా ఆశలను నిత్యనూతనం చేయడానికి ఆయన భార్య, పిల్లలు సైతం బలిపశువులు అయ్యారు. ఆయన పూర్తిగా నా ఆధీనమైనారు. ఆయన భార్యా పిల్లలకి ఆయన అతిథిగా మారారు".

ఒకసారి ఆపి, నా ముఖంలోకి చూసింది నా ముఖకవళికలు పరిశీలించడానికా అన్నట్టు.

ఏమనుకుందో ఏమో కాసిని మంచినీళ్లు తాగి మళ్లీ ప్రారంభించింది.

"ప్రపంచంలో ప్రతి చర్యకీ ఓ ప్రతి చర్య తప్పకుండా ఉంటుందనడానికి నిదర్శనంగా నా భర్తతో నా సహచర్యం పరిసమాప్తమైంది. ఆయన ఎటు వెళ్లారో తెలియదు. నేను తెలుసు కోవాలని అనుకోనూలేదు. ఆ తర్వాత మళ్లీ ఇప్పటివరకూ నన్ను కలవలేదు. నిజం చెప్పాలంటే ఆ రోజున ఆయన వెళ్లిపోవడాన్ని నా మనసు స్వాగతించింది. ఎందుకు స్వాగతించదూ!... నాకున్న అడ్డంకి తొలగిపోయిందిగా. కనుక ఆయన నన్ను వదిలేసారనడం కన్నా నేనే ఆయనకు దూరమయ్యాననటం సబబు. ఈ రోజున సింహావలోకనం చేసుకుంటే అనిపిస్తోంది... 'ఐహికమైన వాంఛాలోలత్వం మోతాదు మించితే వ్యక్తిత్వాలు వధ్యశిలవైపు పయనమవ్వాల్సిందే అనడానికి నిదర్శనమే నా జీవితం, వ్యక్తిత్వం' అని. ఆ వాంఛాలోలత్వమే భర్త సౌజన్యం దూరమవడాన్ని సైతం నేను ఆనందించేటట్టు చేసింది.

అక్కడితో ఆగితే నేను రాజేశ్వరిని ఎందుకు అవుతాను? ఆయన్ని బలవంతం పెట్టి ఆయన భార్యకి తెలియకుండా ఆయన పిల్లలని నా దగ్గరికి పిలిపించుకోవడం మొదలుపెట్టాను. వారిపై ప్రేమ చూపిస్తూ వారికి కావల్సినవి పెడుతూ నా మీద అభిమానం కలిగేలా చేసుకున్నాను. బహుశా మచ్చిక చేసుకోవడం అనొచ్చునేమో!... కాదు కాదు!... అదే నిజం. ఎందుకంటే నేను నా మనసులోని విషయమైనా వాస్తవమే చెప్పాలి. అలా వారికి వారి అమ్మ మీద కన్నా నా మీదే ఇష్టం పెరిగి, నాకు దగ్గరై, నా పట్ల ఆకర్షితులయ్యారు. అలా ఆయన్నే కాకుండా, ఆయన పిల్లల్ని సైతం ఆయన భార్యకి దూరం చేసి, ఆమెని ఏకాకిని చేసాను. నిజం చెప్పాలంటే ఆమె సాధ్వి. ఏనాడూ ఏ రాద్ధాంతం చెయ్యలేదు. కారణం ఆమె అసహాయత కూడా కావచ్చు. మొత్తానికి ఆయన స్త్రీలోలత్వం నేనాడిన ఆటల్లో నాకు గెలుపునే ఇచ్చింది... ఐహికంగా" అంటూ ఉద్వేగంగా చెబుతున్నదల్లా ఆగి, అరుగు మీద చేతులాన్చి, ముందుకు వంగి నిట్టూర్చింది. పశ్చాత్తాపాగ్ని ఆమె కళ్లలోని నీళ్లని సైతం ఆవిరి చేసేసినట్టుంది.


కాసేపు నిశ్శబ్దం. సాధారణంగా ఏకాంతాన్ని, నిశ్శబ్దాన్ని కోరుకునే నాకే ఆమె కథ మధ్య నిశ్శబ్దం భరించలేనిదిగా వుంది. అందుకే ఆ నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ... "ఆ తరువాత?" అన్నాను.

ఆకాశం వంక ఒకసారి చూసి "చీకటి పడిపోయింది మీరిక వెళ్లిరండి" అంది.

"నాకేం ఇబ్బంది లేదు. చెప్పు" అన్నాను.

"మలుపులేందే కథైనా, జీవితమైనా రక్తి కట్టదేమో! అందుకే భగవంతుడు నా జీవితాన్ని అనూహ్యమైన మలుపు తిప్పాడు. కత్తిని నమ్మిన వాడికి కత్తి ద్వారా, భక్తిని నమ్ముకున్న వాడికి భక్తి ద్వారా ఫలితాలు కనిపిస్తాయి. అదే నా జీవితంలోనూ జరిగింది. మళ్లుతున్న వయసు ఆయన స్త్రీలోలత్వానికి ఆటంకం కాకపోవడంతో ఆయన నానుండి మెల్లమెల్లగా దూరమవుతూ వచ్చారు. అంటే భార్యకి దగ్గరయ్యారని కాదు. మరో స్త్రీ ఆయనకి దగ్గరయ్యింది. నేను రక్తిని నమ్ముకుని జీవించానుగా మరి.

ఆ తర్వాత క్రమంగా ఆయన పిల్లలు సైతం నా దగ్గరికి రావడం మానేసారు. ఆయన నాకు చేసిన అన్యాయంలో న్యాయాన్ని వెతుక్కోవడం మూర్ఖత్వమని... వాస్తవాన్ని జీర్ణం చేసుకుని బ్రతుకు బండిని సాగించడానికి అలవాటు పడ్డాను. కొండలు కరిగాయి. నా నగల ఆస్తి




ద్రవీభవించింది. వయసు మళ్లింది. పేదే ఆధార మైంది. ఆలా గాలికి కొట్టుకొచ్చాను.

శివుడు లేడనుకుని ఎవరూ రాని ఈ శిధిలాలయంలో నాకు మాత్రం శివుడు అనుక్షణం కనబడుతున్నాడు. దీపం పెట్టే బ్రాహ్మణుడి కన్నా క్రమం తప్పకుండా వచ్చే మీతో నా కథ చెప్పుకుంటున్నాను. మీరు వ్రాయబోయే కథలో బ్రతకాలని కాదు గాని, నా కోసం కన్నీరైనా కార్చుకోలేని నా మనసుకి ఏదో తెలియని ఊరట. వాంఛలోలత్వంతో గడిపే బ్రతుకు ఎంత దుర్భరాంతమో ప్రపంచానికి తెలియడానికి నేనూ ఒక పాత్రనౌతానని (చెడ్డపాత్రైనా సరే) ఒక తృప్తి" అంటూ ముగించింది.

అప్పుడు చూసాను రెండే రెండు కన్నీటి బొట్లు కనుకొలకుల మీంచి కపోలాలమీదికి జారడం. ఆ శిధిలాలయంలోని శివుడ్ని అభిషేకించడానికి పశ్చాత్తాపంతో ఆమె రాల్చిన ఆ రెండు కన్నీటి బొట్లూ చాలనిపించింది.

"ఎలా వుంది రాజేశ్వరి కథ?" ఆకాశంలోకి చూస్తూ కథ వింటున్న ఉమామహేశ్వరాన్ని అడిగాను.

"బావుంది. ఇక పడుకుందాం" అంటూ పడుకున్నాడు చలికి దుప్పటి కప్పుకుంటూ.

* * *

ఆమె కథలో ఏం కనిపించిందో... వెళ్లే ముందు "మరొక్కసారి ఆ శివాలయంకి వెళ్దాం" అన్నాడు ఉమ. మాట్లాడుకుంటూ శివాలయం చేరాం ఇద్దరం.

ఎప్పుడూ కూర్చునే అరుగు మీద రాజేశ్వరి లేదు. ఏదో వెలితి... యధావిధిగా గుళ్లోకెళ్లి వచ్చి మండపం మీద కూర్చున్నాం.

"తన భర్తని చూడాలని రాజేశ్వరి కోరిక. కానీ, 'తీరా ఎదురుపడితే చూడగలనో లేదో! ఆత్మన్యూనత హృదయస్పందనని బంధిస్తుందే

అనేది" అన్నాను.

ఉమ ఏమీ మాట్లాడకుండా రావి చెట్టు ఆకుల గలగలలని ఆస్వాదిస్తూ, రావి కొమ్మల మీద తిరిగే పక్షులని తదేకంగా పరిశీలిస్తు న్నాడు. కానీ నా మాట వింటున్నాడని మాత్రం అర్థమైంది. అందుకే అన్నాను...

"నిజంగా అలా ఎదురుపడితే ఆమె తనను తాను సంభాళించుకోగలదంటావా?"

"చెప్పలేం"

ఆ 'చెప్పలేం' అనే శబ్దం విచిత్రంగా అని పించింది. కాసేపు లోతైన ఆలోచనల తర్వాత బయటికొచ్చి, "రాజేశ్వరి కథకి పరిపూర్ణత రావ డానికి కొన్ని విషయాల్లో స్పష్టత కావాల్సి వచ్చిం ది. ఈ రోజు అడుగుదాం అనుకున్నాను" అన్నా ను.

"ఏ విషయంలో?" మెల్లగా అన్నాడు

"రాజేశ్వరి తన ప్రేమని కురిపించిన మూర్తి గారి పిల్లల ప్రస్తుత పరిస్థితి ఏమిటి? వారు తల్లికి ఇంకా దూరంగానే వున్నారా? అనే విష యాలు".

నా మాట పూర్తికాకముందే... "బుద్ధి కర్మా నుసారిణి అన్నారు. వారి కర్మలు సత్కర్మలే. వయసుకన్నా ముందే ప్రయాణించి ప్రపంచాన్ని అర్థంచేసుకున్న వాళ్లు. తండ్రి వెట్టిపోకళ్లని త్వరగానే అర్థంచేసుకుని తృణీకరించి, తల్లిని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. కామాతు రాణాం నభయం నలజ్జ అన్నట్టు ఏ మార్పూ లేక బ్రతుకుతున్నది వారి తండ్రి మాత్రమే".

సంధ్యకాంతి పరావర్తనం చెంది ఉమ ముఖంమీద కాషాయ రంగులో ఉజ్వలంగా వెలుగుతోంది.

"నీకెలా తెలుసు?" తుపాకి గుండులా వ

మన జీవితంలో ఇంతవరకూ ఏ పొర పాటూ చేయలేదని భావిస్తున్నామంటే... మన జీవితంలో ఇంతవరకూ ఎప్పుడూ కొత్తదనం కోసం ప్రయత్నించలేదని అర్థం. కొత్తదనం కోసం అన్వేషించు... అందులో ఉండే ఆనం దం ఏమిటో తెలుస్తుంది.

చ్చింది నా నోట్లోంచి ప్రశ్న. అందుకు పూర్తి భిన్నంగా ప్రశాంతంగా వచ్చింది అతని నుండి సమాధానం.

"ఎలా అంటే...! రాజేశ్వరి నా భార్య కాబ ట్టి".

నిశ్చేష్టుడినై తేరిపార చూసాను. నాకు నమ్మకం కలగలేదు. ఉమే అన్నాడు "మొన్నా మధ్య మూర్తి కొడుకు కనిపించి వివరాలు చెప్పాడు".

సూర్యుడు మెల్లమెల్లగా పశ్చిమాద్రి చాటుకి జారిపోతున్నాడు.

"ఇంతకీ ఎప్పుడూ అరుగు మీదే ఉండే రాజేశ్వరి ఏమైనట్లు?" మనసులో అనుకుందా మనుకుని బయటికే అనేసాను.

దీపారాధన చేసి వెళ్లిపోతున్న బ్రాహ్మణుడు నావైపు చూసి, "ఆమె పేరు రాజేశ్వరా? ఆమె నిన్న ఉదయమే చనిపోయింది. గత్యంతరం లేక నేనే మునిసిపాలిటీ వాళ్లకి ఫోన్ చేశాను. వెంటనే తీసుకెళ్లిపోయారు. పాపం ఎవరితోనూ మట్లాడేది కాదు" అంటూ వెళ్లిపోయాడు.

"రాజేశ్వరి జీవితం నీ కథల్లో ఓ కథ అ యింది. నీ కథలో రాజేశ్వరి ఓ పాత్రయింది. నాకే ఏమీ కాలేకపోయింది" అంటూ నిట్టూర్చా డు ఉమ.

శిధిలాలయంలో సైతం తానున్నానని నిరూ పించాడు శివుడు. ●